


# జరిగిందిదీ!

- తాడికొండ కె. శివకుమార శర్మ

సర్వతర్యామీ, ఆశరీరుడూ, అనిమేషుడూ అయిన శ్రీహరి, అశరీరురాలు, అనిమేషురాలు అయిన శ్రీలక్ష్మి పాల సముద్రం పైన శేషతల్పశాయి మీద విశ్రాంతి తీసుకుంటుండగా వైకుంఠద్వారం వద్ద కలకలం రేగింది - ఎప్పటిలాగే ఋషిపుంగవులూ, దేవగణాలూ ప్రతిరోజూ నిర్ణీత సమయానికి శ్రీహరి గుణగణాల్ని కొనియాడడానికి నెలకొల్పిన భజన సంప్రదాయాన్ని ఆ రోజు కూడా పాటించబోతున్నారని తెలుపుతూ.

ఆ భజనలో, నిరాకారుడంటూనే ఆయన సాకారతని వాళ్ళు పొగుడుతారు.

మత్స్యావతార రూపుణ్ణి కీర్తిస్తారు.

అమృతాన్ని దక్కించి అమరుల్ని చేసినందుకు అదితి వంశీయులు కూర్మావతార రూపుణ్ణి కొనియాడతారు. భక్తి మార్గం ద్వారా వైకుంఠానికి సశరీరులుగా విచ్చేసే ఋషిపుంగవులు కూడా తపస్సు ద్వారా ఎప్పుడో ఒకప్పుడు అమరత్వాన్ని పొందలేకపోతామా అన్న ఆశతో ఇంద్రలోక వాసులతో శృతి కలుపుతారు. (మోహినీ అవతారాన్ని కూడా మొదట్లో కీర్తించేవారేగానీ, ఆ సౌందర్యాన్నారాధిస్తూ భక్తిమార్గం నుండీ దేవగణాలూ, ఋషిపుంగవులూ కూడా త్రోవ మళ్ళడం మొదలు పెట్టేసరికి ఆ అవతార భజనకి మాత్రం దూరంగా ఉండాలని నిశ్చయించుకున్నారు.)

ఇంద్రలోకాన్ని తల్లడిల్ల చేసిన హిరణ్యాక్ష హిరణ్య కశిపులను మట్టుపెట్టినందుకు దేవేంద్రుని ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వరాహ, నరసింహావతారాలని కీర్తిస్తారు. బలిచక్రవర్తి పీడని వదిలించి, దేవేంద్రుని, దిక్పాలకుల ఆధిపత్యాన్ని పునరుద్ధరించి, అమరావతిని మళ్ళీ శోభాయమానంగా చేసి, మానవలోకంలో లోభ, మద, మత్సర్యాలను తిరిగి ప్రవేశపెట్టి, తద్వారా మోక్షగామిత్వాన్ని మానవుల ఆలోచనల్లో నింపినందుకు వారు ప్రత్యేకంగా శ్రీహరిని ప్రశంసిస్తారు.

ఋషులంటే చేతగాని వారు కాదనీ, కావాలంటే శౌర్యంలోను,. పరాక్రమంలోనూ క్షత్రియులకు తీసిపోరనీ నిరూపించినందుకు మునిపుంగవులు పరశురామావతారాన్ని వేనోళ్ళ కొనియాడతారు.

ఆ రోజు కూడా వాళ్ళు భజన అలాగే చేశారు.

అనంతరం, ఋషిపుంగవుల్లో ఒక యువకుడు లేచి నిలబడి, "స్వామీ!" అన్నాడు.

"ఏమీ?" అన్నాడు శ్రీహరి.

"హే నిరాకారా! హే నిరామయా! దుష్ట శిక్షణకూ, శిష్టరక్షణకూ నీకు ఆ పరమేశ్వరుడు కూడా సాటి రాడని నువ్వు నీ అవతారాల ద్వారా వెల్లడించావు. అయితే -" అని వాక్యాన్ని మధ్యలోనే ఆపివేశాడు.

శ్రీహరి చిరునవ్వు నవ్వి, "ఆపేశావేం?" అని అడిగాడు.

"మరేం లేదు స్వామీ. తమరు కోపగించుకోనంటే - " అని మళ్ళీ ఆగాడు.

"నిర్భయంగా చెప్పు" అన్నాడు శ్రీహరి.

"ఆ మాత్రం తెలుసుకోరేమిటి? అన్నిమార్లడగాలా?" అన్నది అనిమేషురాలు శ్రీలక్ష్మి చూపులతోనే.

"ఆ ఆలోచన అతని నోటినుంచీ వెలువడితేనే దానికి విలువ. లేకపోతే నేనే చెప్పించానని అందరూ అపోహపడతారు" అన్నాడు శ్రీహరి ఆ చూపుల తూపులను తిప్పికొడుతూ.

"మత్స్యావతారంలో తమరు ఆ దైత్య సంహరణను క్షణాల్లో గావించారు. అందువల్ల తమరి ప్రతాపం గూర్చి మానవుల్లో సరైన అవగాహన లేకుండా పోయింది. దానికి కారణం కొందరు మానవులు చేపను గాలం వేసి పట్టుకుని తినడం కావచ్చు " అన్నాడాయువయతి.

"వీడికి పోగాలము దాపురించినది. ఇంక వైకుంఠంలో ప్రవేశం లేకపోవచ్చు" అనుకున్నారు అనుభవజ్ఞులైన మునిపుంగవులు.

"కూర్మావతారం వల్ల జరిగిన మేలు ఒక్క దేవతలకేనని మాలోని కొంతమంది తుచ్ఛమానవులు నమ్ముతున్నారు కూడా మరియు, మోహినీ అవతారమెత్తి అమృతాన్ని పంచినది కూడా దేవతల లాభం కోసమే తప్ప తమకేమీ మేలు ఒనగూడలేదని కూడా వారు తలుస్తున్నారు. పైగా, ఒకే తండ్రికి పుట్టిన అదితి సంతానాన్ని దేవతలుగానూ, దితి సంతానాన్ని రాక్షసులుగానూ వర్గీకరించడంలో గల రాజకీయమేమిటని కొందరు తెలివైన మానవులు ప్రశ్నిస్తున్నారు. మోహినీ అవతారాన్నెత్తి ఒక్క దేవతలకి మాత్రమే మేలు ఒనగూర్చినందుకు ఆ అవతారానికి ప్రాముఖ్యతను కూడా ఇవ్వటం లేదు. ఎక్కడా మిమ్మల్ని మోహినీ రూపంలో కొలవడం లేదు. పైగా, గరళాన్ని గొంతులో దాచుకుని ప్రపంచాన్ని రక్షించినందుకు ఆ పరమశివునకే ఎక్కువ విలువనిస్తున్నారు." అన్నాడతను మళ్ళీ.

ఆ మాటలకు దేవేంద్రుడు ఆగ్రహోదగ్రుడై వజ్రాయుధాన్ని సర్రున వెలికి తీశాడు. దేవగురువైన బృహస్పతి అతన్ని వారించాడు - ఒక బ్రహ్మహత్యాపాతకం చాలులే అని.

"అడవిలో వేటకై వెళ్ళి చేతగానితనం వల్ల వరాహం చేతిలో హిరణ్యాక్షుడు మృతి చెందితే దాన్ని కాస్తా చిలవలూ పలవలూ చేసి తమరు వరహావతారంలో దంతాల మీద భూమిని నిలబెట్టడమేమిటని, అసలు చతుర్దశ భువనాలనేవి మేడ అంతస్తులలాగా ఉంటే వాటిలో ఒకటైన భూమి గుండ్రంగా ఎట్లా ఉంటుందనీ, పైగా భూమి మీద నీళ్ళు ప్రత్యక్షంగా కనిపిస్తుండగా ఆ భూమిని నీళ్ళ మీద పెట్టి తమరు హిరణ్యాక్షుడితో యుద్ధం చెయ్యడం బూటకమనీ, అందువల్ల ఆ వరాహానికి దైవత్వాన్ని ప్రసాదించడమేమిటని కూడా కొందరు మానవులు ప్రాశ్నిస్తున్నారు" అన్నాడతను.

"ఇక స్థంభంలోనుంచీ సగం నరరూపంలోనూ సగం సింహం రూపంలోనూ వచ్చి హిరణ్యకశిపుణ్ణి చంపడమేమిటి? ఆ అవతారాన్ని చూసింది ఒక్క ప్రహ్లాదుడే కదా! అతనే ముందస్తుగా తండ్రిని చంపేడేమో రాజయ్యేందుకు? అతని ఒక్కని కాకమ్మ కథకూ అంత విలువేమిటని మరికొందరు మానవులు ప్రశ్నిస్తున్నారు."

"బలి చక్రవర్తి రాజ్యంలో ఎవరికీ యాచన చెయ్యవలసిన అవసరం గానీ, దానమిచ్చే దాతలకు లోటుగానీ ఉండేది కాదనీ, ఎవరికీ పగవారు ఉండేవారు కారనీ, వానలు సకాలానికి కురిసేవనీ, అందువల్ల మిమ్మల్ని ఎవరూ తలవ వలసిన, కొలువ వలసిన అవసరం లేక మీ ఉనికిని కూడా స్మరణ చెయ్యకపోయేసరికి మీకు కోపమొచ్చి బలిని రాజ్యభ్రష్టుణ్ణి చేశారనీ నింద ఉంది. అందుకనే ఆ రూపంలో మీకు గుళ్ళూ, గోపురాలూ ఏవీ కట్టించడం లేదు."

"మానవ మాత్రుల్లో పరాక్రమవంతులు లేరా? ఒకడు పదిమందిని జయించగలిగితే ఇంకొకడు వందమందిని మట్టుపెట్టగలడు. అలాంటప్పుడు పరశురాముడు ఎవరో అసామాన్య మానవుడు గావచ్చుగాక! మతే గానీ, తమరి అవతారమని ఎలా నమ్ముతామని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. అందుకే, ఆయనకూ గుళ్ళూ, గోపురాలూ ఏవీ వాళ్ళు కట్టించలేదు."

"ఈ అవతారాలన్నిటిలో ఒక్క నరసింహుడికే కొద్దిగా విలువనిస్తున్నారు. అక్కడ కూడా, హిరణ్యకశిపునికి రాక్షసుడిగా, బలవంతుడిగా పెద్ద పేరుంది కనుక నరసింహుడు కొద్దిగా బలవంతుడయ్యుంటాడంటున్నారు. కాకపోయినా, సింహం అంటే ఎలాగో వాళ్ళు భయపెడతారాయె."

"అందుకని, అందరికీ అర్ధమయ్యేలా, తమరు ఒక నిర్వివాదమైన అవతారాన్నెత్తమని నా ప్రార్ధన." అని ముగించాడా యువయతి.

సభలో కలవరంతో నిండి కలకలం చెలరేగింది. ఇంకో అవతారాన్నెత్తమనడం బాగానే ఉంది గానీ, ముందు అవతారాలని కొరగానివనడం ఎంత సమంజసం? స్వామికి కోపం వస్తుందేమో! పైగా, అవతార పురుషుడు కారణం లేకుండా అవతారాన్నెలా ఎత్తుతాడు? అయినా కూడా, ఆ యువయతి మాటల్లో ఏం మంత్రం ఉన్నదో, అతని ఆలోచనా సరళిలోని తర్కాన్ని కాషాయ వస్త్రధారులు గానీ స్వర్ణాలంకార భూషితులుగానీ కాదనలేకపోయారు.

✡✡✡

"ఏమిటి తండ్రీ అంత హఠాత్తుగా పిలుపునిచ్చారు?" అన్నాడు చతుర్ముఖుడు.

"దుష్టశిక్షణకు సమయమాసన్నమౌతుంది" అన్నాడు శ్రీహరి.

"దుష్టులెక్కడ?" అన్నాడు విధాత తన తాళపత్ర గ్రంధాలను ఆశ్చర్యంతో చకచకా తిరగేస్తూ, తనెక్కడైనా పొరపాటు చేశాడేమోన్న అనుమానంతో మెడను ముందుకు వంచి భూలోకాన్ని పరికిస్తూ.

"దుష్టశిక్షణ చెయ్యాలంటే ముందేం కావాలి?" అన్నాడు శ్రీహరి.

"అందుకేగా దుష్టులకోసం వెదుకుతున్నాను. భూలోకంలో చెడుగుణాలున్నవాళ్ళు పుట్టలు పుట్టలుగా కనిపిస్తున్నారు గానీ, అట్లాంటి ప్రతీ ఒక్కరి కోసం ఒక్కొక్క అవతారాన్ని ఎత్తలేరు కదా!"

"నిజమైన దుష్టుణ్ణి సృష్టించవలసిన సమయం ఆసన్నమైంది."

"ఈ సారి ఎలాంటివాడు కావాలి?"

"నా ముందరి అవతారాల్లో నాకు సమవుజ్జీయైన దుష్టుడు లేడని మానవలోకంలో కొందరు అపోహ పడుతున్నారట. ఆ అపోహ ఈ అవతారంతో తొలిగిపోవాలి. నేనంటే భయంలేక, పరాక్రమంలో నాకు సాటి వచ్చే వ్యక్తి కావాలి."

"హతవిధీ!" అని లోలోపలే నిట్టూర్చాడు విధాత. ఏదో ఒక మానవుణ్ణి సృష్టిద్దాంలే అనుకుంటూంటే - మళ్ళీ దితి వంశీయుడొకడు జనించాలన్నమాట! ఈ దాయాదుల మధ్య వైషమ్యాలకు అంతులేదా?

"మీ అంత బలవంతుణ్ణి సృష్టిస్తే - మొదటికే మోసం రావచ్చునేమో?"

"నాలుగు తలకాయలున్నాయి. ఆలోచించు." అన్నాడు శ్రీహరి. "అలాగే, ముందరి అవతారాలన్నీ త్వరగా ముగియడం మానవులకు నా విజయాల మీద, శక్తి మీద అపనమ్మకాన్ని కలిగించడానికి కారణభూతమైందట. ఈ సారి అలాంటి అపనమ్మకాలకు ఆస్కారం లేకుండా చేసే బాధ్యత నీది."

"ఇప్పటిదాకా ప్రతీ అవతారంలోనూ నన్ను ఇక్కడ వదిలేసి వెళ్ళారు స్వామీ! ఈ సారి నేను మీతో వచ్చి తీరాలి. పైగా అక్కడ ఎక్కువ కాలమే ఉంటామంటున్నారు." అన్నది శ్రీలక్ష్మి కలిపించుకుంటూ.

"విన్నావుగా కుమారా మీ తల్లిగారి కోరిక? విధాతవు. విధినెలా నిర్ణయిస్తావో!"

✡✡✡

"అనాథ రక్షకా! ఆపద్భాంధవా!! దీనజన రక్షకా!! పాహి! పాహి!!" అన్న ఆర్తనాదాలతో అనిమేషుడా శ్రీహరి, దీనంగా, చేతులు జోడించి ఉన్న ఋషి పుంగవుల, దేవగణాల సమూహం వైపు తలతిప్పాడు.

"ఆ రావణుని ఆగడాలు మితిమీరిపోతున్నాయి స్వామీ! భక్తి ప్రపత్తులతో మిమ్మల్ని కొలుచుకోనీయకుండా అడ్డం పడుతున్నాడు. అతని అండ చూసుకుని అడవుల్లో ఉండే అతని సమూహం యజ్ఞాలకూ, యాగాలకూ అంతరాయం కలిగిస్తున్నారు." అన్నారు ఋషిపుంగవులు.

"అష్టదిక్పాలకులన్నారు! పంచ భూతాలన్నారు! వాటికన్నిటికీ అధిపతినన్చెప్పి అన్నీ దేవేంద్ర సింహాసనం మీద కూర్చోబెట్టారు. రావణుడి చేతిలోనే కాకుండా ఆఖరుకు వాడి కొడుకు ఆ మేఘనాధుడి చేతిలో కూడా నేను ఓడిపోయాను. ఈ వరుణుడు, వాయువు, అగ్నీ నా చెప్పు చేతల్లో లేరు. ఆ రావణుడు నిలబడమంటే వాళ్ళు నిలబడాలి, కూర్చోమంటే కూర్చోవాలి. అందుకే రావణ రాజ్యం అతివృష్టీ, అనావృష్టీ లేకుండా సుభిక్షంగా ఉంది. అక్కడ మిమ్మల్ని తలుచుకునే నాధుడే లేడు. ఇంక నేనెందుకు, నా పదవెందుకు?" అంటూ వాపోయాడు స్వర్గలోకాధిపతి.

"కుమారా!" అన్నాడు శ్రీహరి.

"తండ్రీ!" అని ప్రత్యక్షమయ్యాడు విధాత.

"దుష్టశిక్షణకు సమయం ఆసన్నమయిందా?" ముందున్న ఆశ్రితుల వైపు తలతిప్పి చూపిస్తూ అడిగాడు శ్రీహరి.

"అవుతూ ఉంది తండ్రీ! వివరాలు మీరూ, నేనూ చర్చించాలి"

"విన్నారుగా! ఇంక మీరు నిర్భయంగా వెళ్ళండి" అన్నాడు శ్రీహరి.

వాళ్ళిద్దరూ నిష్క్రమించిన తరువాత, "ఇప్పుడు చెప్పు" అంటూ శ్రీలక్ష్మి వైపు తిరిగి, "అక్కడ కోడలు ఒంటరిగా ఉన్నట్లుంది" అన్నాడు శ్రీహరి.

"ఇక్కణ్ణుంచీ వెళ్ళమని చెప్పొచ్చుగా!" అని మూతి విరిచి మెరుపు, మేఘము కలిసి అంతర్ధానమయ్యాయి.

"తల్లిగారు మీతో భూలోకానికి వస్తారు. కానీ, ఈ అవతారంలో ఆవిడకూ, మీకూ కొంతకాలం వియోగం తప్పదు."

"అర్థమైంది. ఆవిడ నాతో వస్తానంది. కానీ నాతోనే ఉండాలనలేదు. అయినా, ఇది ఆవిడకు నచ్చే అంశం అనుకున్నావా?"

"కాదని తెలుసు తండ్రీ! కానీ, రావణుడు అంచనాకు మించి బలవంతుడయ్యాడు."

"అదేమిటి, నీ అంచనా అలా ఎలా తారుమారయ్యింది?"

"రావణుడు మానవుడయితే ఇలా అయేదే కాదు!"

"మరి... మళ్ళీ?"

"అవును తండ్రీ. అతను దితి సంతతిలోనివాడే పులస్త్యబ్రహ్మపౌత్రుడు. అందువల్ల అతని జీవితాన్ని సంపూర్ణంగా నిర్దేశించే అవకాశం నాకు కలగలేదు. అతను పరమశివుణ్ణి గూర్చి ఘోర తపస్సు చేసి, ఆయనకు ప్రీతిపాత్రుడయ్యాడు."

"ఈ శివుడింతే. నేనేదైనా చెయ్యడానికి తలబడితే ఇట్లా అడ్డం పడుతుంటాడు. అందుకే ఆ దైత్యులందరికీ ఆయనంటే ప్రాణం."

"అందుకు మోహినీ అవతారమే గదా కారణం!"

"గతం గతః అయినా మళ్ళీ ఆ పరిస్థితి గనక వస్తే నేను మళ్ళీ అదే చర్య తీసుకుంటాను."

"ఇప్పటి పరిస్థితిని గూర్చి ఆలోచించండి. రావణ్ణి సంహరించాలంటే తమరు మానవావతారాన్నెత్తాలి."

"సరే. అయితే, పరుశురామావతారంలోని ప్రత్యేకత ఇక్కడ వెయ్యింతలుండాలి!"

"అందుకు రావణుడు మీ భార్యనెత్తుకుపోవాలి."

"కుమారా, నీకు నాలుగు తలలున్నాయిగానీ, మతి మాత్రం లోపించినట్లుంది. మానవావతారాన్నెత్తి భార్యను - అందునా మీ తల్లిగారిని - ఒక దుష్టుని చేత అపహరింప జేసుకోవాలా?"

"మానవావతారాన్ని ఎత్తుతామని ఒకవేళ తమరు అనుకోకపోయినా, రావణుడు శివుని చేత పొందిన వరం వల్ల తమకది తప్పదు. ఇకపోతే, మానవుల రోషానికి, పరాక్రమానికీ ప్రతీక, స్త్రీని అవమానించిన వాణ్ణి పరాభవించడం, ఓడించడం. అందునా, భార్యను అపహరించిన వాణ్ణి సంహరించడం అన్నిటికన్నా తలమానికమైనది."

"తప్పదా?"

"తప్పదు."

"ఇదెక్కడి సృష్టి కుమారా?"

"పూర్తిగా నా సృష్టి కాదు తండ్రీ. నాకంత శక్తి సామర్థ్యాలనిచ్చారు కూడానా? నేను మిమ్మల్ని దాటిపోతానేమోనని ముందుగానే నా పరిధిని, పరిమితుల్ని నిర్ణయించేశారు కదా!"

"ఆ సంగతిప్పుడెందుకులే. సరే, తరువాత?"

"ఆ భార్యను వెతుకుతూ తమరు కొండల వెంట, కోనల వెంట, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తిరగాలి."

"మానవుడిగా ఆ విలపించడం సహజంగానే అబ్బుతుంది అంటావా? ఇక్కడేమో మరి మనకి రాగద్వేషాలేమీ ఉండవాయె!"

"అనుమానం అక్కరలేదు తండ్రీ. ఆ సంగతి నేను చూసుకుంటాగా! ఆలోచిస్తే, ఇప్పటిదాకా, తమరి అవతారాలన్నిట్లో ద్వేషమే తప్ప రాగమేమీలేదాయె. అందుకని ఈ అవతారాన్ని మానవులు ప్రత్యేకంగా అభిమానిస్తారు."

"అయినా కొండల్లోనూ, కోనల్లోనూ తిరగడం ఎందుకూ?"

"మీ పినతల్లిగారు మిమ్మల్ని అక్కడకు పంపిస్తారు గనుక."

"కోడల్ని ఎవరో ఎత్తుకెడతాడని ఆవిడకు తెలియదు."

"మరెందుకు?"

"కొడుక్కు పట్టం కట్టడానికి"

"అంటే... నేను రాజకుమారుడిగా పుడతానా?"

"అవును తండ్రీ."

"అయితే, నా పరాక్రమంతో రావణుణ్ణి క్షణంలో తుదముట్టిస్తాను."

"తమరు మానవావతారాన్నెత్తి కూడా, క్షణాల్లో రావణుణ్ణి సంహరిస్తానంటే - మళ్ళీ నరసింహావతారంలాగా తయారవదూ? ఈ అవతారానికి కూడా మానవులు అంత ప్రాముఖ్యాన్నివ్వకపోవచ్చు కదా!"

"అదీ నిజమే!"

"మీరు కొండల్లో, కోనల్లో తల్లిగారిని ఆ రావణుడు ఎత్తుకు వెళ్ళక ముందు కూడా తిరుగుతారు."

"చెప్పావుగా, పినతల్లి పంపిస్తుందని!"

"సరిగ్గా విన్నారో లేదోనని చెప్పాను. అలా తిరుగుతున్నప్పుడు రావణుడు మిమ్మల్ని మోసం చేసి సీతను - అది మానవావతారంలో తల్లిగారి పేరన్నమాట - ఎత్తుకు వెడతాడు."

"సర్వాంతర్యామినైన నన్ను ఓ తుచ్ఛ దానవుడు మోసం చెయ్యడమా? ఇది నా ఉనికినే ప్రశ్నించే సమస్య. దీనికి నేనొప్పుకోను."

"మోహినీ అవతారాన్నెత్తి దైత్యులను మోసం చేసినందుకు, ఒక దైత్యుడు మిమ్మల్ని మోసం చేశాడంటే దైత్యగణాలు కూడా చెల్లుకు చెల్లని కొంత ఉపశమించవచ్చు. రావణ సంహారానికి ముందు మీరు పరమశివునికి పూజ కూడా చేస్తారు."

"నేను శివునికి పూజ చెయ్యడమా?"

"రావణుడు శివభక్తుడు కదా. లేకపోతే శివుడికి రాముడే - అది మానవుడిగా మీ పేరు - మీరన్న సంగతి తెలియదు కనుక అనవసరంగా ఆయన ఆ రావణుడి తరఫున మీతో యుద్ధం చేసే అవకాశం ఉంది. ఇద్దరూ శివభక్తులే అయితే, అప్పుడాయన ఎవరి పక్షానా ఉండడు."

"సరే కానీ"

"ఈ అవతారంలో మీకు తమరే శ్రీహరి అన్న సంగతి గుర్తుండదు."

"పరుశురామావతారంలో దేవుడినన్న సంగతి నాకే తెలియకపోతే పోయె. ఈ అవతారంలో అదేగాక నేను మోసం చెయ్యబడడం కూడానా?"

"మానవుడిగా మీరు పడే ఇక్కట్లకు కోట్లాది సంవత్సరాలపాటు మీకు గుర్తింపు ఉంటుంది. ఈ అవతారాన్ని కొనియాడుతూ వీధి వీధికి ఒక గుడిని కడతారు."

"పోనీ అంతగా సీతను ఆ రావణుడు ఎత్తుకెళ్ళాలంటే ఏ అపరాత్రో రాజభవనంలోకి ప్రవేశించి ఆ పని చెయ్యొచ్చుగా? ఈ కొండల కోనల వెంట తిరగడం ఎందుకు?"

"ఎవరూ లేని చోట మోసం చెయ్యబడడం వల్ల భార్యను దుష్టులెత్తుకుపోతే ఆ పురుషునికి ప్రజల సానుభుతి ఉంటుందిగానీ, రాజప్రసాదంలోకి నిర్భయంగా అడుగుపెట్టి రాణిని ఎత్తుకు పోతే అది ఆ రాజు మగతనానికీ, పౌరుషానికీ పెద్ద వేటు. అలా జరిగితే మిమ్మల్ని పూజించడం మానేసి చేతగానివాడన్న పేరునంటగడతారు."

"సరే. మానవుల గూర్చి నీకు తెలిసినంతగా నాకు తెలియదనే చెప్పుకోవాలి. ఈ అవతారంలో అవన్నీ తెలుసుకుంటా."

"ఇందులో ఇంద్రాద్రి దేవతల సహాయంకూడా కావాలి - రావణుడు పొందిన వరాలకు భంగం రాకుండానే అతన్ని సంహరించడానికి."

"వాళ్ళని పిలు. శాసిద్దాం!"

✡✡✡

"పరంధామా, పిలిచారుట?"

"ఇందాక మానవుల, మీ ఆర్తనాదాలు, ఆక్రోశాలు విన్నమీదట విధాత దుష్టశిక్షణకు సమయం ఆసన్నమవుతున్నదని చెప్పాడు కదా! దానిలో మీకు కూడా పాత్ర ఉందని విధాత చెప్పమన్నాడు."

"లోక కళ్యాణం కోసం మీకు సహాయపడటం మాకెంతో ఆనందంగా ఉన్నది. సత్వరం సెలవివ్వండి. మీ ఆజ్ఞను తప్పక పాటిస్తాను" అన్నారు దేవగణాలు ముకుళిత హస్తులై.

"మీకు వానర వనితల వల్ల జనించే సంతానం నా సైన్యమవుతుంది."

ఇంద్రాది దేవతల మొహాల మీద దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. వాళ్ళు ఒకళ్ళు ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు. ముందుగా తేరుకున్నది దేవేంద్రుడే ధైర్యం తెచ్చుకుని, సూర్యుడు, వాయువు, అశ్వినీ దేవతల ముఖాలు పరికిస్తూ ఇలా అన్నాడు. "అనుక్షణమూ దేవలోకపు అప్సరసలతో ఆనందపుటంచులని చవిచూసే నేను అహల్య వంటి మానవ వనితకోసం దేవలోకాన్ని వదిలి

వెళ్ళమన్నా వెడతాను. కానీ - వానర వనితలతో విహారం - తల్చుకోవాలంటేనే వళ్ళు గగుర్పొడుస్తోంది. పోనీ మేమేమైనా తప్పులు చెయ్యడం వల్ల మమ్మల్ని శిక్షించాలనుకుంటే, అప్సరల మాటే తలపెట్టకుండా మమ్మల్ని మా భార్యలతోనే సమయాన్నంతా గడపమనండి. అంతే కానీ ఇలా-" గొంతు గద్గదం కాగా మధ్యలోనే ఆపేశాడు.

రాగద్వేషాలకు అతీతులు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే అక్కడ స్వర్ణాలంకార భూషితుల అశ్రువులు పాల కడలికి రంగునే మార్చేసేవి.

"తప్పదు దేవేంద్రా" అన్నాడా అనిమేషుడు చిరునవ్వుతో.

"పోనీ, మేము వానరులుగా మారి ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించడానికి వీలవుతుందా?" జాలిగా అడిగాడు దేవేంద్రుడు మినుకు మినుకుమంటున్న ఆశతో.

"నేను మానవావతారాన్నెత్తి పడబోయే ఇక్కట్లతో పోలిస్తే ఇదేమంత కష్టం కాదని విధాత సెలవిచ్చాడు. వానర స్త్రీ పురుషుల మధ్య జరిగే సృష్టి కార్యక్రమం సాధారణ విషయం. అసాధారణ విషయాల వల్ల కానీ రావణ సంహారం జరిగిందని రావణునికి వరంట!"

"ఇట్లాంటి వరాన్ని ఆ పరమశివుడే ఇచ్చి ఉంటాడు. భక్తి చూపిస్తే చాలు - ఒక భస్మాసురుణ్ణి, ఒక హిరణ్యాక్షుణ్ణి, ఒక హిరణ్యకశిపుణ్ణి, ఇప్పుడీ రావణ్ణి తయారుచెయ్యడానికి కారకుడవుతాడు" గొణుక్కున్నారు ఇంద్రాది దేవతలు.

రావణుడికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు అతడు ఎక్కడ అమరత్వాన్ని వరంగా కోరుతాడోనని భయపడి తను హడావుడిగా అడ్డం పడడం వల్ల ఆలోచనా శక్తి కొద్దిగా వికటించి రావణుడి మెదడులో ఇలాంటి ఆలోచననే తనే ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పడానికి విధాతకు గొంతు పెగల్లేదు.

"పోనీ, అప్సరసలతో మేము వానర రూపాలతో విహరిస్తే?" ఇంద్రుడు గొంతు సవరించుకుని దీనంగా ప్రశ్నించాడు దేవేంద్రుడు.

"వానరులతో విహరించడానికి మాకెందుకు అభ్యంతరముండదు?" అని ప్రశ్నించడానికి అక్కడ అప్సరలు లేరు. శ్రీహరిని కొలవడానికి వచ్చే దేవగణాల్లో పురుషులే తప్ప స్త్రీలెవరూ ఉండరు - అక్కడికొచ్చే ఋషిపుంగవులు దేవతా స్త్రీలను చూసి పొరపాటునైన వశం తప్పుతారేమోనని వారికి ఆ ఇబ్బందులేవీ కలగకుండా ఉండటానికి ఇంద్రాది దేవతలు వారి భార్యలను, అప్సరసలనూ దేవేంద్రలోకంలో వదిలి వస్తారు.

"సరే. అలాగే కానిండు" అన్నాడు శ్రీహరి.

"ధన్యోస్మి" అన్నారు అక్కడున్న ఇంద్రాది దేవతా పురుషులు.

"నా తండ్రికి మమకారం లేకపోవచ్చు గాక! కానీ, దైత్యులంతా నా పౌత్రులు, ప్రపౌత్రులే. కశ్యప ప్రజాపతి వంశం వారే. అదితి వంశం వారి బాగే కాక వీరి బాగును కూడా నేను కోరడంలో తప్పేముంది? ఈ అదితి వంశపు వారసులైన దేవగణాలు దీన్ని అవమానంగా భావిస్తే నాకింకా ఆనందం" అనుకున్నాడు విధాత. అలా అనుకున్న తరువాత గుర్తొచ్చింది - తను రాగద్వేషాలకు అతీతుడినన్న సంగతి.

✡✡✡

దిగంతాలవరకూ వ్యాపించిన విజయాలను కీర్తిస్తూ, నృత్య, గీత, తాళ వాద్యాదులతో సభనలరిస్తూ ఇంద్రలోకం నుండీ తెచ్చిన మణులతో అలంకరించబడి ధగధగా మెరిసే రావణ సభ నిశ్శబ్దంగా, నిర్జీవంగా, నిర్జీవంగా ఉంది.

తన అంతఃపురంలో, దాదాపు గాఢాంధకారంలో, శూన్యంలోకి చూస్తూ, అంతర్ముఖుడై ఉన్నాడు పులస్త్యబ్రహ్మ పౌత్రుడు, రావణ బ్రహ్మ.

ఎంత మెల్లగా వచ్చినా, గజ్జెల చిరుసవ్వడిని విని, ఆ వచ్చినది మండోదరి అని గ్రహించాడు.

"స్వామీ!" అన్నదామె మెల్లగా.

అతనా పిలుపుకు స్పందించకపోయినా, అతను వింటున్నాడన్న నమ్మకంతో కొనసాగిందామె - "సీతను అప్పగించి "

"అసంభవం!" అన్నాడు నిర్ద్వంద్వంగా, నిశ్చలమైన గొంతుతో, పుత్రశోకంతో నిండివున్న ఆమెను ఇంకా బాధించడం ఇష్టం లేదతనికి.

"ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగాస్త్రంతో బంధిస్తే తెప్పరిల్లి మేఘనాధుణ్ణి మనకు దూరం చేశాడంటే - అతను దేవేంద్రునికంటే బలవంతుడని తెలుస్తోంది.. యముడు ఇంద్రజిత్తుని దరికి ధైర్యంగా చేరాడంటే - లక్షణుడి అన్న ఇంకెంత బలవంతుడైయ్యుండాలి? మీ ప్రతాపం మీద నమ్మకంలేక కాదు. ప్రతిద్వంది శక్తియుక్తుల్ని గుర్తించమని నా విన్నపం." అన్నదామె ధైర్యంగా, దీనంగా.

"అవతలి వ్యక్తి గురించి నాకు బాగా తెలుసు దేవీ! ఇది తరతరాలుగా మాకు జరుగుతున్న మోసానికీ, అన్యాయానికీ కొనసాగింపు. అంతే. నేను కూడా ఇందులో సమిధనవుతానేమోనన్న భయం కాదు నా మనసులో ఉన్నది. ఈ మోసాన్ని నేను కూడా అడ్డుకోలేకపోతున్నానన్న బాధ."

ఆ చీకట్లోనే, ఆమె కళ్ళు శోకంతో కెంపులయి వెదజల్లే కాంతిలోకి చూస్తూ కొనసాగించాడు.

"అర్ధం కాలేదా? చెబుతాను విను. కశ్యపప్రజాపతికి ఇద్దరు భార్యలు - దితి, అదితి. దితి సంతానాన్ని దైత్యులన్నారు. అంటే మా పూర్వీకులు. అదితి సంతానం స్వర్గలోకంలో ఉంటుంది. ఆనాడు శ్రీహరి మోహినీ అవతారాన్నెత్తి దైత్యులకు అమృతం లేకుండా చేశాడు - వాళ్ళు చెడ్డవాళ్ళన్చెప్పి. అందుకనే అదితి సంతానం మాత్రమే అమరులు. యముడు కూడా వాళ్ళవాడే కానీ, అమరులు భోగలాలసత్వంలో మునిగివున్న నిర్వీర్యులు. ఆలోకంలో ఒక్క పరాక్రమవంతుడు ఎంత వెదికినా కనిపించడు. పైగా, ఆ ఇంద్రుడికి ఏ మానవుడైనా తపస్సు మొదలుపెట్టాడంటే భయం పట్టుకుంటుంది - తన పదవికెక్కడ ముప్పొస్తుందేమోనని! అందుకే, భూలోక వాసుల్ని చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి అతివృష్టినీ అనావృష్టినీ కలిపిస్తుంటాడు. అదే, మన రాజ్యంలో ఎప్పుడైనా వాడు తోకాడించడానికి ప్రయత్నించాడా?"

"మరి బలవంతులు మా వంశంలో పుట్టారన్నప్పుడు ఆ శ్రీహరి కల్పించుకుంటుంటాడు మమ్మల్ని నిర్మూలించడానికి. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు చేసిన నేరాలేమిటి? ముల్లోకాలనూ జయించడం - అదీ వాళ్ళు చేసిన నేరం. రాజు అన్న తరువాత పరాక్రమాన్ని ప్రదర్శించుకోవడంలో తప్పేమిటి? ఏ యుద్ధంలోనైనా ఓడితే అదే అతని అంతం. గెలిచిన వాడు ఓడిన వాళ్ళు ఎలా ప్రవర్తించాలో నిర్దేశిస్తాడు. అందుకే మా రాజ్యంలో ఆ మోసగాడు శ్రీహరి ప్రస్తావన రానివ్వకూడదన్నాం. అలా అనడానికి విజేతలుగా మాకు అధికారం ఉన్నది. అలాగని దేవుడే లేడనలేదే! పరమశివుడికి గుళ్ళున్నాయి కదా మన రాజ్యంలో!"

"హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, నేను కూడా బ్రహ్మ గూర్చి, శివుని గూర్చి తపస్సు చేసి వరాలను పొందినవాళ్ళమే. శౌర్యానికీ, పరాక్రమానికే కాక భక్తి ప్రపత్తులకు, దానగుణానికీ కూడా మే పెట్టింది పేరు. పరమశివుడి భక్తుడిగా నాకు యుగయుగాలకీ తరిగిపోని ఖ్యాతి ఉంటుంది. దేవగణాల్లో భక్తి ప్రపత్తులకు గానీ శౌర్య పరాక్రమాలకు గానీ పేరు పొందిన ఒక్క వ్యక్తి పేరు చెప్పు! వాళ్ళల్లో దానగుణంలో బలిచక్రవర్తి కాలిగోటికి సరిపడే వారెవ్వరు? వాళ్ళు భోగలాలసులు. పని చెయ్యక్కర్లేదు. మదిర, మగువలతో కాలం గడపడం వారి దినచర్య. ఆ శ్రీహరికి కూడా కావలసిందదే. ఇంద్రలోకపు వాసులు నిర్వీర్యులు కనుక, ఏ చిన్న ఆపద వచ్చినా 'పాహి! పాహి!' అంటూ అతని వద్దకు పరుగెడుతుంటారు గనుక వాళ్ళ ఆపదలను తీర్చే ఖ్యాతిని అతనొక్కడే స్వంతం చేసుకుంటాడు."

"మాకు మోసగాళ్ళని, మాయావులనీ ముద్రవేశాడు గానీ, ఆ శ్రీహరికి సరితూగే మోసగాడు మాలో ఎవడూ లేడు. హిరణ్యాక్షుడు వైకుంఠాన్ని ముట్టడిస్తే ఎదురుపడే ధైర్యంలేక అతడి ముక్కులో దాక్కుని ఆ శ్రీహరి బయటపడ్డాడు మూడడుగుల నేల కావాలంటూనే

ముల్లోకాలు ఆక్రమించాడు. ఇదంతా ఎందుకు? మమ్మల్ని హతమార్చి ఆ దేవేంద్రుడికి ఇంద్రపదవిని కట్టబెట్టడానికి. ఒకసారి విఫలుడైన తర్వాత విశ్వజిద్యాగాన్ని చేసి అపార శక్తుల్ని పొంది ఇంద్రలోకాన్ని బలిచక్రవర్తి ముట్టడిస్తే ఆయనని ఎదుర్కోలేక దేవేంద్రుడు తనవారినందరినీ తీసుకుని అక్కడినుంచీ పారిపోయాడు. కానీ వాడి తల్లి అదితి ఆ శ్రీహరిని ప్రార్థించింది - ఏమని? తన సవతి సంతతి అయిన దైత్యుల్ని పరాజితుల్ని చేసి తన సంతానాన్ని అడవులనుంచీ వెలికి తెచ్చి మళ్ళీ అమర లోకానికి చేర్చమని! అంతే తప్ప బలి చక్రవర్తి ఇంకెవరినీ బాధిస్తున్నాడని గానీ ఆయన రాజ్యంలో అధర్మం నాలుగుపాదాలా తిరుగాడుతోందనీ కాదు! దానికి ఈ శ్రీహరి ఏం చేశాడు? ఎనిమిదేళ్ళ వటువు రూపంలో వచ్చి ఆయనను మోసం చేశాడు. ఈ అదితి సంతానానికున్న గొప్ప విలువలేవో చూడు! కుబేరుడు వాడి అన్న ఉచ్యథుడి భార్యను బలత్కరించాడు. చంద్రుడు బృహస్పతి భార్య తారను లేపుకు పోయాడు. వీళ్ళు మాకు సాటిలేని మేటి దాయాదులు!"

ఆ మోసగాడి ప్రభావం మానవులమీద చాలా ఉంది. ఎప్పుడూ 'నారాయణ' అనుకుంటూ తన్మయత్వంలో మునిగిపోతే ఆ శ్రీహరి కరుణించి, పనీపాటల్లేని స్వర్గలోకానికి వాళ్ళని చేరుస్తాడని అపోహపడుతూంటారు. విధాత కల్పించుకోబట్టి కొందరు మాత్రమే ఈ జాడ్యానికి గురయ్యారు గానీ, లేకపోతే ఎవరి జీవనం గూర్చి వాళ్ళు పట్టించుకోకుండా సింహం మీదబడితే నరసింహుడికి ఆహారమవుతున్నామని, అడవి పంది అటకాయిస్తే వరాహవతారుడే మీదబడుతున్నాడని ఆనందంగా అందరూ క్రూరమృగాల పాలై మానవజాతి ఎప్పుడో అంతమయ్యుండేది."

"తపస్సు చెయ్యడానికి కావలసిన ఏకాగ్రత జనవాసాల్లో లభించదని అడవులకెడతారు కొందరు. అప్పటికి అక్కడే స్థిరవాసాన్నేర్పరచుకున్న ఆదిమవాసులు వీళ్ళ ఆక్రమణని ప్రతిఘటిస్తే వాళ్ళకి ఆటవికులనీ, అనాగరికులనీ - ఇంకా ఒక అడుగు ముందుకు వేసి - రాక్షసులనీ పేర్లు పెట్టి, శ్రీహరి కోసం తపస్సు చెయ్యడానికి అడ్డుపడ్డ వీళ్ళ నిర్మూలనకి రాజుల సహాయాన్ని కోరతారు. ఆదిమవాసులను నిర్వాసితులను చెయ్యడాన్ని సహించలేని నేను ఆ అన్యాయాలను ఎదుర్కొన్నాను. అందుకని కూడా శ్రీహరి శత్రువుగా నాకు ప్రగాఢ ముద్రపడ్డది."

"త్రిమూర్తులలో ఒకరు మాకు ముత్తాత. ఇంకొకళ్ళకి మేము ప్రియభక్తులం. అతనికి మాత్రం తలవంచమనీ, మా దాయాదుల మధ్య తలదూర్చి వైషమ్యాలను రగిలించింది చాలక మమ్మల్ని కాలరాయాలని ప్రయత్నిస్తూనే ఉంటాడు."

"ఇవన్నీ ఒక ఎత్తు. నన్ను నయవంచనతో మట్టుపెట్టాలనుకోవడం మరో ఎత్తు. 'సీతను అప్పగిస్తే?' అనికదా నువ్వన్నావు? శూర్పణఖకి - ఒక స్త్రీకి - ముక్కు, చెవులు కొయ్యడం అమానుషమే కాదు, దైత్యులు కూడా సహించలేని రాక్షసత్వం కూడా. ఒక స్త్రీకి తనకి నచ్చిన పురుషునికి చేరువవడానికి ఎందుకు చొరవ చూపకూడదు? రాయబారానికి వచ్చినప్పుడు హనుమంతునికి నేనేమని చెప్పాను? 'నీ రాజుకు లాగానే నేను సీత ముక్కు, చెవులు కోసేసి వెనక్కి వచ్చివుంటే లోకంలో అందరూ దెబ్బకు దెబ్బ అనేవాళ్ళు! కానీ నేనలా చెయ్యలేదే! తను కోరుకుంటే ఆమెను నా రాణిగా చేసుకుంటానని చెప్పానే గానీ ఇన్నాళ్ళు నా నిర్భంధంలో ఉన్నాగానీ ఆమె శీలానికి ఏ మాత్రం హాని కల్గనివ్వనీకుండా ప్రవర్తించాను. నీ రాజుకు లేని మానవత్వాన్ని నేను చూపించాను. నేను సీతను ఎత్తుకు వచ్చింది తద్వారా ఆ రాముని దురహంకారాన్ని లోకానికి వెల్లడించడంకోసం. నీరాముణ్ణి, నా చెల్లెలుకు చేసిన పనికీ, అవమానానికీ క్షమాపణ చెప్పుకోమను. అప్పుడు సీతను పువ్వుల్లో పెట్టి అప్పచెబుతాను."

"దానికా హనుమంతుడు, నేను చెప్పినవన్నీ కల్పితాలన్నాడు. శ్రీరాముడు చీమకూడా హాని చెయ్యనివాడన్నాడు. సీతను ఎత్తుకొచ్చింది చాలక నా నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు చెబుతున్నానన్నాడు. 'పోనీ నీ రాముణ్ణి, నా చెల్లెలు ముక్కు చెవులు కొయ్యడం గూర్చి అడుగు, ఏం చెబుతాడో విను' అన్నాను. తనకవసరం లేదన్నాడు. తనకు ఆ రామునిమీద అపారమైన నమ్మకం

ఉన్నదన్నాడు. రాయబారిగా వచ్చినవాడు చెయ్యవలసిన పని నీతులు బోధించడం కాదు. సందేశాన్ని అందించడం. ఆ మూర్ఖత్వం మీద కోపంతోనే అతని తోకకి నిప్పంటించమన్నాను. ఆ తరువాత అంగద రాయబారమూ అంతే."

"ఇదంతా ఆ శ్రీహరి మాయే. ఆ శ్రీహరే ఈ రాముడు. మా దితి వంశాన్ని అంతం చెయ్యడానికి ఎదుటపడి యుద్ధం చెయ్యలేక జంతువుల రూపంలోనూ, బలిచక్రవర్తిని అంతం చెయ్యడానికి చిన్న వటువు రూపంలోనూ వచ్చింది చాలక నన్నెదుర్కోవడానికి ఇప్పుడే మానవావతారంలో వచ్చాడు."

"రామలక్ష్మణులను మేఘనాధుడు నాగాస్త్రంతో బంధిస్తే, గరుత్మంతుడే స్వయంగా వచ్చి వాళ్ళను దాన్నుంచి బంధవిముక్తుల్ని చేశాడు గనుక వాళ్ళీనాడు నాతో యుద్ధం చేస్తున్నారు. కాకుంటే, జయం నాదే పరమేశ్వరుడిని నరులు, వానరులచేత సంహరించపబడకూడదని వరం అడగని మాట వాస్తవమే. కానీ, గరుత్మంతుడే వచ్చి వాళ్ళకు సహాయం చేస్తే అది ఆ దితి సంతతి వాళ్ళే వచ్చి సహాయం చేసినట్టుకదా! ఇది వరభంగం కాదా? మరి ఈ విషయం గూర్చి నేను ఎవరిని ప్రశ్నించాలి?"

"నాకు నా జీవితం మీద ఆశలేదు మండోదరీ! యుద్ధంలో గెలిచినవాడు ఓడినవాడి చరిత్ర వ్రాస్తాడు కనుక శూర్పణఖకి చేసిన అన్యాయానికీ, జరిపిన అమానుషానికీ రాముడు క్షమాపణ చెపితే ఈ యుద్ధం తప్పేదని ఎవరూ చరిత్రలో వ్రాయరు. ఇంద్రజిత్తు నాగాస్త్రంతో రామలక్ష్మణులను బంధిస్తే, వాళ్ళను శరీరంలో అంగుళం కూడా ఖాళీ లేకుండా రక్తసిక్తుల్ని చేస్తే, దాన్ని మాయా యుద్ధమని వ్రాస్తారు. అదే నీలుడు నాతో యుద్ధం చెయ్యలేక తన మహాస్వరూపాన్ని రెప్పపాటు కాలంలో కుంచించుకుని నా రథధ్వజం మీదకు దూకితే దాన్ని మాయ అని అనరు - పరాక్రమమని వ్రాస్తారు. రాముడికి కావలసింది సీతని నేను తిరిగి అప్పగించడం కాదు. యుద్ధం! ఆ యుద్ధంలో దితి వంశీయుడైన నన్ను అంతమొందించడం!! ఆ త్రిమూర్తుల్లో ఇద్దరు మౌనంగా ఉంటారు. విధాత ఆ శ్రీహరి కుమారుడే కదా! అందుకని విధిని శ్రీహరికి కావలసినట్లుగానే నిర్దేశిస్తాడు."

✡✡✡

రామావతారాన్ని చాలించి వైకుంఠంలో అడుగుపెట్టిన శ్రీహరికి స్వర్గలోకవాసులు జయజయధ్వానాలు పలుకుతూ స్వాగతాన్నిచ్చారు. ఇంద్రుడి ముఖంలో కళ తప్పడం చూసి కారణమేమిటని శ్రీహరి ప్రశ్నించాడు.

"ప్రభూ! తమరి కార్యాచరణకై వానరుణ్ణై సంగమించాను. నా పుత్రుడు వాలి రావణుడితో యుద్ధంలో మరణించితే అంత బాధ పడేవాణ్ణికాదు. కానీ, తమరు అలా వెనకనుంచీ బాణం వేసి -" అని ఇంక చెప్పలేక ఆగిపోయాడు.

"దీనికేం సమాధానం చెబుతా"నన్నట్లు విధాతవైపు చూశాడు శ్రీహరి.

"రాముడు మానవుడు. వెనకనుంచీ దెబ్బతియ్యటం మానవ సహజమైన లక్షణం అంతే" అన్నాడు తేలిగ్గా విధాత.

"తల్లినని కూడా చూడకుండా నాకెన్ని ఇక్కట్లు కల్పించావు?" అని మండిపడ్డది భూలోకపు రాగద్వేషాలను ఇంకా పూర్తిగా వదలని శ్రీలక్ష్మి. ఆ సెగకు అగ్నిదేవుడు అదిరిపడ్డాడు.

"క్షమించు తల్లీ. కానీ, మానవులలో పురుషుల వైషమ్యాలకు స్త్రీలను పావులుగా వాడుకోవడం పరిపాటి. అందుకే ఈ అవతారంలో సహజత్వం పాలెక్కువ. అందుకనే ఈ అవతార స్వరూపునికి వున్నన్ని గుళ్ళూ, గోపురాలు ఇంకే అవతారానికీ ఉండవు. అంతేకాక, ఈ ఒక్క అవతారానికి కట్టించిన గుళ్ళల్లోనే తమరు తండ్రిగారి పక్కనే ఎల్లప్పుడూ ఉంటారు. లక్ష్మి పక్కన లేకుండా నారాయణుడు మాత్రమే ఉండే గుళ్ళుంటాయి, కానీ సీత పక్కన లేకుండా రాముడికి గుళ్ళెక్కడా ఉండవు."

"ఏమైనా సరే! తరువాతి అవతారంలో నాకు ఒక్క కష్టం కూడా కలగడానికి వీల్లేదు."

'అలాగే తల్లీ!"

"మానవావతారాన్నెత్తినా నేను శ్రీహరినేనన్న సత్యం నాకు తెలియడంలో తప్పేం లేదు. అలా అయితే ఎక్కువమందికి నా అవతార మహిమలను ప్రత్యక్షంగా చూసే అవకాశముంటుంది. రామావతారంలో లాగా కాకుండా తరువాతి అవతారంలోని ప్రతి అంశాన్నీ నేనే నిర్దేశిస్తాను. ఆ పనిని నీకు వదిలేస్తే ఏమవుతుందో ప్రత్యక్షంగా అనుభవించానుగదా!"

"అలాగే తండ్రీ!"

అశరీరుడూ, అనిమేషుడూ, సర్వాంతర్యామీ అయిన శ్రీహరి పాలసముద్రంపైన శేషతల్పశాయి మీద పవళించడానికి ఆయుత్తమవగా అశరీరురాలు, అనిమేషురాలు అయిన శ్రీలక్ష్మి ఆయన పాదాల చెంత తనచోటువైపు నడిచింది.

✡✡✡